క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



ఎంపీడీఓ నిర్మలాదేవిని సన్మానిస్తున్న కన్వీనర్ బుజ్జిరెడ్డి అధికారులు

ఐరాల: ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీఓ నిర్మలాదేవిని శుక్రవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీఓ సేవలను కొనియాడారు. నాగవాండ్లపల్లె సచివాలయ మహిళా పోలీస్ భవ్యరెడ్డి సేవలకు ప్రశంసాపత్రం అందుకున్నందుకు ఎంపీడీఓ అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఈఓ కుసుమకుమారి, ఏఓ సంధ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని అనంతాపురం లేఅవుట్‌ను శుక్రవారం పరిశీలించిన ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలకు అవసరమైన బిల్లును సకాలంలో ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

5 శాతం భూమి ఇవ్వాల్సిన పనిలేదు

చిత్తూరు అర్బన్: నూతనంగా ఏర్పాటు చేసే ప్రైవేట్ లేఔట్ల ఆమోదం కోసం ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నం–145ను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. జీవో –145 ప్రకారం ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు నూతనంగా ఏర్పాటు చేసే లేఔట్లలో 5 శాతం భూమిని జిల్లా కలెక్టర్‌కు అప్పగించాల్సి ఉండేది. సదరు లేఔట్‌లో స్థలం ఇవ్వలేని పక్షంలో 5 శాతం భూమికి సమానమైన మొత్తాన్ని మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాల్సి ఉంది. ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలు సంస్థల నుంచి అందిన వినతుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ – 145ను ఉపసంహరిస్తూ, తాజాగా జీవో–13 జారీ చేసిందన్నారు. తాజా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ఏర్పాటు చేసిన, చేస్తున్న లే అవుట్లకు సంబంధించి నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

నేడు విదేశీ విద్యపై అవగాహన సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : విదేశీ విద్యపై మొట్టమొదటి సారిగా చిత్తూరు నగరంలో నేడు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్వీ డిగ్రీ కళాశాల చైర్మన్ ప్రసాద్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం సాయంత్రం 4 గంటలకు విదేశీ విద్యపై అవగాహన సదస్సు ఉంటుందన్నారు. విర్జీనియా ఓవర్ సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి కిటకిట

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. రోజుకు 200 వరకు జ్వరం, జలుబు, దగ్గు కేసులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఆ విభాగంలోని వైద్యులు తక్షణమే వారికి తగిన వైద్యం చేస్తూ, సరైన మందులు, మాత్రలు అందిస్తున్నారు.

మామిడిలో అంతరపంటలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మామిడి తోటల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో 180 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల్లో మిరప, మినుము, వేరుశెనగను రైతులు అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలు కావడంతో నీటి ఖర్చు తగ్గుతుంది. మామిడి తోటలకు వాడే నీటితోనే అంతర పంట లను సాగు చేయవచ్చని, దుక్కులు దున్నే ఖర్చు, విద్యుత్ ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడి బాగా ఉంటుందని, అంతర పంటలకు వాడే ఎరువులతో మామిడి చెట్లకు పోషకాలు అందుతాయని పేర్కొంటున్నారు.





గుడిపాల: దారి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బంగారుపాళెం: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గడప గడపలో సంక్షేమ కాంతులు

- దారి సౌకర్యం కల్పించాలని దళితుల వినతి
- పరిష్కార మార్గం చూపిన ఎమ్మెల్యే ఆరణి

గుడిపాల: ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు నింపుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని బసవాపల్లె పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని కోరారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా ?లేదా? అని ఆరా తీశారు. డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తుండడంతో, టీడీపీ నాయకులు ఓర్వలేకనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారందరికీ పార్టీలకు, రాజకీయాలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

దారి సౌకర్యం కల్పించండి

దారి సౌకర్యం కల్పించాలంటూ కట్టకిందపల్లె దళితవాడ ప్రజలు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కోరారు. కట్టకిందపల్లె దళితవాడకు వెళ్లేందుకు చాలా ఏళ్లుగా ఒకేదారిలో వెళ్తున్నామని ప్రస్తుతం కొంతమంది తమకు సంబంధించిన పట్టాభూమంటూ వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆయనకు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దారిని చూసి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలందరూ ఎమ్మెల్యేని ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారని అడగ్గా వెంటనే దారికి అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించి ప్రస్తుతం రాకపోకలు సాగించాలని చెప్పారు. ఆపై పదిరోజుల్లోగా దారి సమస్యని పరిష్కరించి వాటిలో ప్రభుత్వం ద్వారా రోడ్డును కూడా వేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. దీంతో మహిళలు, గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు సుధాకర్‌నాయుడు, రజినీకాంత్, మణి, జయకోడి, గుణవతి, మోహన్, ఎంపీటీసీలు మొగిలిరెడ్డి, డానియల్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివాజీరాయల్, సైమాన్, ఆనంద్, స్టాలిన్, రవీంద్రారెడ్డి,రవి, క్రిష్ణ, రెడ్డప్ప, సాయి, శిలంబరసన్, సాయిప్రతాప్, లడ్డురెడ్డి, దావిద్, తహశీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీవో ఉపేంద్ర, ఎఈలు జయచంద్రారెడ్డి, హిమంత్, గణేష్‌లతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మిట్టపల్లెలో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మిట్టపల్లె, నూనెగుండ్లపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

బంగారుపాళెం: నాడు జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తేగానీ పేదలకు పథకాలు అందేవికాదు.. నేడు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమం అందుతోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని సంక్రాంతిపల్లె, బేరిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబానికి అందిన పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇతర సీఎంలు అనుసరిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ–2 జయకుమార్, జెడ్పీటీసీ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు ఇంటి వద్దే ఆరోగ్యసేవ



పశు ఆరోగ్యసేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: ఇక నుంచి మూగజీవాలకు ఇంటి దగ్గరే మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవల వాహనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిందన్నారు. 1962కు ఫోన్ చేస్తే చాలు అంబులెన్సులు రైతుల ముంగిటకు వెళ్లి సేవలందిస్తాయన్నారు. ఈ అంబులెన్సులో అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులతోపాటు పశువుల వాహనంలో ఎక్కించేందుకు హైడ్రాలిక్ సౌకర్యం ఉందన్నారు. అనంతరం ఈ అంబులెన్సులో ఒక పశువైద్యుడు, వెటర్నరీ సహాయకుడు, డ్రైవర్, అటెండర్ ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, ఎంపీడీఓ గౌరి, డీడీ ప్రభాకర్, ఏడీ గీతారెడ్డి పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

పూతలపట్టు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌ను గెలిపించాలని ఆయన సోదరుడు రాధాకృష్ణ కోరారు. మండలంలోని అయ్యప్పగారిపల్లి, వడ్డేపల్లి, అమ్మేపల్లి గ్రామాలలో శుక్రవారం కరపత్రం అందజేసి ప్రచారం చేశారు. అనంతరం పట్టభద్రులతో మాట్లాడి పేర్నాటికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివయ్య, హరి, గోపి, మల్లిరెడ్డి, ఎంఎస్ మణి, రాజారెడ్డి, సాయికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ నిరుపేదలకు వరం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



తవణంపల్లె: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరంలా మారిందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎగువ వెంకటాపురంలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురం, గురుకువారిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక పలు రగాల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురుకువారిపల్లెలో వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. వైద్య శిబిరంలో గర్భవతులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు ఆరోగ్య సూత్రాలు, పారిశుధ్యంపై, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలో వైద్య సిబ్బంది ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అంటువ్యాధుల నివారణ–పరిసరాల శుభ్రతపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లు సఖ్యతతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుబ్బన్న

బంగారుపాళెం: ఎలక్ట్రీషియన్లు సఖ్యతతో నడుచుకోవాలని జిల్లా ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ కార్యదర్శులు సుబ్బన్న, శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎలక్ట్రీషియన్ డే ను మండల ఎలక్ట్రీషియన్ ప్లంబర్స్ అండ్ రివైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శనగా వెళ్లి ఎలక్ట్రీషియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎలక్ట్రీషియన్స్ నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్సర్, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి జానకిరామ్, ముబారక్, గణపతి, శంకర, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన



జలజీవన్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న శంకర్

గుడిపాల: జలజీవన్ మిషన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జలవనరుల ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్ అన్నారు. ఆయన శుక్రవారం కమ్మతిమ్మాపల్లె పంచాయతీలో జలజీవన్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ కార్యాచరణ ప్రణాళికలు, గ్రామ భాగస్వామ్య పద్ధతులను ఎలా నిర్వహించాలి అన్న విషయమై వివరించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ మురళీకష్ణ, రఘునాథరెడ్డి, రామారావు, సర్పంచ్ కోమల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నింబుజాదేవి ఆలయం ఆవరణలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ పూజలకు విచ్చేసిన మహిళా భక్తులకు సౌభాగ్య మాంగల్యదారాలు, కుంకుమను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విశ్రాంత డీఎస్పీ దలవాయి రాఘుజెట్టి, హిందూ ధర్మప్రచార మండి జిల్లా సభ్యులు రాజ్‌కుమార్, హిందూధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు, సభ్యులు, డిల్లీకుమార్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని నగర కమిషనర్ అరుణ చెప్పారు. కమిషనర్ శుక్రవారం ఉదయం బండపల్లి –1, 2, తేనెబండలే అవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, ఇందుకోసం అవసరమైన సహకారాన్ని అందిస్తామని వివరించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను మార్చి 15 కల్లా పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రధానంగా బిఎల్, ఆర్‌ఎల్ స్టేజిలో ఉన్న గృహాలను వేగవంతం చేయాలని, ఇందుకోసం లబ్ధిదారులకు తగిన మార్గనిర్దేశం చేయాలన్నారు. ఇసుక, ఇటుకలు సకాలంలో అందేలా చూడాలని స్పష్టం చేశారు. మేస్త్రీలను సమన్వయం చేసుకుని పనుల్లో ఆలస్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులో చెత్త రవాణా వాహనాన్ని తనిఖీ చేశారు. వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, నరసింహతోపాటు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూజర్స్ చార్జీలు వేగవంతం చేయండి

నగర పాలక సంస్థ పరిధిలో ‘క్లీన్ ఆంధ్రప్రదేశ్’ కార్యక్రమంలో భాగంగా యూజర్ చార్జీల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నగర కమిషనర్ అరుణ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వీడియో సమావేశం ద్వారా క్లాప్ కార్యక్రమం అమలవుతున్న వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. క్లాప్ వార్డుల్లో కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ నుంచి తప్పనిసరిగా యూజర్ చార్జీలు వసూలు చేయాలని, గృహాల నుంచి వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. నెలవారీ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంహెచ్వో డా.లోకేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్‌ను బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో క్రై, ప్రగతి, పోర్డ్ స్వచంధ సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. లలితమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాల్లో దక్షిణ భారత్‌లోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 29 శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాలికల సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా తగ్గుతోందన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 934 మంది మాత్రమే మహిళలు ఉన్నారని చెప్పారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వందల సంఖ్యలో బాల్యవివాహాలు జరిగేవన్నారు. అయితే ప్రస్తుతం అధికారులు, పాలకుల చొరవతో గణనీయంగా తగ్గినట్లు చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనకు తాము కలసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.

నేటి రథసప్తమికి ఆలయాల ముస్తాబు



నగరి : ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ



ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

నగరి : పట్టణ పరిధిలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీకరియమాణిక్యస్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న రథసప్తమి కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయ గోపురానికి ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. కోవిడ్ కారణంగా ఆగిన కల్యాణోత్సవ సేవలు రెండేళ్ల తర్వాత జరుగుతుండడంతో ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. దీంతో గతంలో కంటే భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ టీటీడీ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు శ్రీభూనీలా సమేత కరియమాణిక్యస్వామి వార్లకు తిరుమంజనం, ప్రత్యేక పూజలు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. కల్యాణోత్సవం పాల్గొన దలిచిన దంపతులు శనివారం మధ్యాహ్నం రెండు గంటల లోపు రూ. 500 చెల్లించి రశీదు పొందాలని సూచించారు. దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గతంలో కంటే అధిక మోతాదులో ప్రసాదాలను తయారు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని కోరారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని ప్రముఖ శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని, స్వామివారు సప్త వాహనపై పురవీధుల్లో దర్శనమిస్తారని ధర్మకర్త శ్రీధర్ తెలిపారు. వేకువజామున అభిషేకాది పూజలు, 7 గంటలకు సూర్యప్రభ వాహనం, 9గంటలకు శేషవాహనం, 11 గంటలకు అశ్వవాహనం, ఒంటిగంటకు హంస వాహనం, మధ్యాహ్నం 3 గంటలకు గరుడవాహనం, 5గంటలకు హనుమంత వాహనం, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారి విహారం ఉంటుందని పేర్కొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో సర్వం సిద్ధం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకుని శనివారం వేకువ జామున సుప్రభాత సేవ, 4.30 నుంచి 5.30 మధ్య శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. 5.30 నుంచి 6 గంటల వరకు ఉత్సవర్ల సమర్పణ అనంతరం మూల విరాట్‌ను పట్టుపీతాంబరాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య తిరువీధి ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు.